క్లుప్తంగా

స్వల్పంగా పెరిగిన వేరుశనగ, కంది ధరలు



ధారూరు మార్కెట్లో నిర్వహిస్తున్న బీట్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్లో శనివారం నిర్వహించిన బీట్లలో వేరుశనగ, కందులకు స్వల్పంగా ధరలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కందులు తక్కువగా క్వింటాల్‌కు రూ.7,350, మధ్యస్తంగా రూ. 7,500, ఎక్కువగా రూ. 7,580 వరకు ధర పలికింది. గత వారం కన్నా ఈ వారం క్వింటాల్‌కు రూ. 250 పెరగడంతో రైతులు తాము తీసుకువచ్చిన కందులను విక్రయించారు. అలాగే వేరుశనగ ధర సైతం రూ. 100 పెరిగింది. గత వారం ఎక్కువగా క్వింటాల్‌కు రూ.6,200 వరకు విక్రయాలు నిర్వహించారు. మార్కెట్‌లో కొనుగోలుదారులు పోటీపడి మరీ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధమ్మ రైతులకు మద్దతు ధర లభించేలా కొనుగోళ్లు నిర్వహించాలని వ్యాపారులకు సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగిఉండాలని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులతో పాటు వయోజనులు ఓటుహక్కు గురించి తెలుసుకోవాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

బీజేపీ మండల నేతలు



ఆర్థిక సహాయం అందిస్తున్న బీజేపీ నేతలు

దోమ: పేదలకు బీజేపీ అండగా ఉంటుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన కుమ్మరి రాములు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నేతలు మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నర్సింహాయాదవ్, శ్రీనివాస్, నర్సింహులు, వెంకటేశ్, నరేశ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

గాజీపూర్‌లో వైద్య శిబిరం



ఉచితంగా మందులు తీసుకుంటున్న రోగులు

తాండూరు రూరల్: సోలార్ కంపెనీ సెంబ్ కార్ప్,షేర్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం గ్రామంలోని శివాలయంతో పాటు గ్రామ పంచాయతీ వద్ద రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు షుగర్, బీపీతో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఓంకారేశ్వర స్వామి ఆలయంలో పూజలు



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్మించబడిన శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయ ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం ఉత్సవ మూర్తులను గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. శనివారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు సోమవారం వరకు కొనసాగనున్నాయి.

'స్థానిక' కోలాహలం

- ప్రభుత్వ కసరత్తు ప్రారంభం
- ఆశావహుల్లో పెరుగుతున్న టెన్షన్
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నేతలు



ఎన్కేపల్లి గ్రామ పంచాయతీ భవనం

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించింది. దీంతో గ్రామాల్లో ఆశావహుల కోలాహలం ఎక్కువైంది. సీటు ఎవరికి వస్తోందనని టెన్షన్‌లో ఉన్నారు. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో కొందరు నేతలు బిజీబిజీగా ఉన్నారు. ఏడాది కాలంగా గ్రామాల్లో స్థానిక ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని పెట్టుకున్న ఆశలకు రెక్కలు వచ్చినట్లెయింది. రాష్ట్రంలో చేపట్టిన కుల గణన పూర్తి వివరాలు ప్రభుత్వం వెల్లడించింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం నియమించిన డెడికేషన్ కమిటీ నివేదికను త్వరలో ఇవ్వనుండటంతో ఎన్నికలు నిర్వహిస్తారని ప్రజల్లో నమ్మకం పెరిగింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వడం సాధ్యం కానప్పుడు పార్టీ పరంగా ఇస్తామని కాంగ్రెస్ పేర్కొనడంపై ఆశావహులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేయడంతో గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులకు పోటీ చేసే నాయకులు దూకుడు పెంచారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు రిజర్వేషన్లను బట్టి ముందుకు సాగేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు. బీసీ వస్తే నాకు, ఎస్సీ వస్తే నీకు, జనరల్ అయితే ఆయనకే.. నిలబడేందుకు ఆస్కారం ఉందని ఇలా లెక్కలు వేసుకుంటున్నారు. ఇందు కోసం ఆర్థికంగాను సర్దుకుంటున్నారు. ప్రతీ ఒక్కరితో కలిసి మాటామంతి పెంచుకుంటూ కలివిడిగా ఉంటున్నారు. రానున్న ఐదారు రోజుల్లో పూర్తి స్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైన నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా సమావేశాల్లో చెప్పకనే చెబుతున్నారు. రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించడమే తరువాయి. మండల పరిధిలోని 29 గ్రామ పంచాయితీలు, 12ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ముందుగా ఎంపీటీసీల? సర్పంచుల? అనేది ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది.

స్పష్టత రాని మున్సిపాలిటీల ఏర్పాటు..

9గ్రామ పంచాయితీలను కలుపుతూ మున్సిపాలిటీ ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వానికి గత నెలలో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. ఐదారు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది.

అడుగంటిన భూగర్భజలాలు

- పనిచేయని బోరుబావులు
- ఎండుతున్న పంటలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు

దౌల్తాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో సాగు నీరందక పంటలు ఎండుతున్నాయి. రోజురోజుకు ఎండలు పెరుగుతుండడంతో దౌల్తాబాద్, నందారం, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, గుముడాల, ఇండాపూర్, యాంకి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. బోరుబావుల నుంచి సరిపడా నీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంట చేతికి రాకపోతే చేసిన అప్పులు ఎలా తీరుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భజలాలు అడుగున చేరడంతో అక్కడక్కడ బోర్లు పనిచేయకపోవడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. మండలంలో 35వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో సుమారు 10వేల ఎకరాల్లో మొక్కజొన్న, వరి, తదితర పంటలు సాగు చేశారు.

ప్రత్యామ్నాయ మార్గాల వైపు..

బోరుబావుల్లో నీరు తక్కువ కావడంతో ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం చాలా మంది రైతులు చెరువుల కింద, బోరుబావుల కింద పంటలు సాగు చేశారు. అయితే బోరుబావుల్లో నీటి మట్టం తగ్గడంతో కొందరు అదనంగా బోర్లు తవ్విస్తున్నారు. మరి కొందరు రైతులు పక్కచేన్ల బోర్లనుంచి నీటిని సరఫరా చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. దౌల్తాబాద్‌లో శేఖర్, భీములు, గోవిందురెడ్డి అనే రైతులు రెండు రోజుల క్రితం బోర్లను తవ్విస్తే నీటిచుక్క పడలేదు. ఇలా భూగర్భజల మట్టం తగ్గడంతో వారు ఆందోళన చెందుతున్నారు.



దౌల్తాబాద్‌లో శివారులో ఎండుతున్న వరిపొలం

రేషన్‌కార్డుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు

తాండూరు రూరల్: ప్రజా పాలనలో వచ్చిన రేషన్ కార్డు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ పేర్కొన్నారు. శనివారం తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ.. తాండూరు పట్టణం, రూరల్‌తో కలిపి నూతన రేషన్‌కార్డుతో పాటు మార్పులు, చేర్పుల కోసం 3276 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రభుత్వం మీ సేవ కేంద్రాల్లో నూతన రేషన్‌కార్డుల దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ప్రారంభించిందన్నారు. కావున ఇప్పటి వరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు ఇచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నామని తెలిపారు. ఇంక ఎవరైనా నూతన రేషన్‌కార్డుతో పాటు కార్డులో మార్పులు, చేర్పులకు సంబంధించి మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.



రేషన్‌కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

యువకులు క్రీడల్లో రాణించాలి



మోమిన్‌పేట: టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట: యువకులు క్రీడల్లో రాణించాలని ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్ ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల యువకులకు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటును మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్లతో యువకుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీయొచ్చన్నారు. యువతి, యువకులు క్రీడల్లో ప్రతిభ చూపిస్తే భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేమారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

కుల్కచర్ల: సేవాలాల్ జయంతి ఫిబ్రవరి15వ తేదీని సెలవుదినంగా ప్రకటించాలని లంబాడీ ఐక్యవేదిక జిల్లా కోఆర్డినేటర్ విస్లావత్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గిరిజన ప్రజల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించి పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ సెలవులేకపోవడంతో గిరిజన ఉద్యోగులు, తదితరులు జయంతి ఉత్సవాల్లో పాల్గొనలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మండల అధ్యక్షుడిగా రాంచంద్రయ్య

పూడూరు: యాదవ సంఘం అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానని జీపల యాదయ్య యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రాకంచర్లలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పూడూరు మండల అధ్యక్షుడిగా కాటం రాంచంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కావలి అశోక్, దశరథ్, నర్సింలుయాదవ్, ప్రధాన కార్యదర్శులుగా భేరి ఆంజనేయులు యాదవ్, ఉదాన్‌రావు ప్రవీణ్, నరేందర్, లింగం, శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా అంజయ్య, వెంకటయ్య, చెన్నయ్య, శ్రీనివాస్, యాదయ్య, శ్రీనివాస్, యూత్ కమిటీ అధ్యక్షుడిగా మెరుగు పాండు, సురేష్, రాజు, నాయకులు రాంగోపాల్, రాజు, మల్లేష్, నర్సింలు, కాటం నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



రాంచంద్రయ్యను సన్మానిస్తున్న నాయకులు

అభివృద్ధే లక్ష్యం



దుద్యాల్: రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి

దుద్యాల్: అభివృద్ధే లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఈర్లపల్లి, చిలుముల మైల్వార్ గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈర్లపల్లి గ్రామం నుంచి వాల్లగడ్డ తండా వరకు రూ.1.6కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, చిలుముల మైల్వార్ పాఠశాలలో రూ.40 లక్షలతో నిర్మించనున్న 3 అదనపు గదులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్య, దుద్యాల్ మాజీ సర్పంచ్ ఖాజా, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్‌రెడ్డి, శశికాంత్, నబి తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మాధవరెడ్డి



బంట్వారం: సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారంలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

ధారూరు: నాగారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన నియోజకవర్గ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించారన్నారు. ఎంపీ నియోజకవర్గంలో రూ. కోట్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎంపీ తగిన చొరవ తీసుకుని నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు వడ్లనందు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ మండల అధ్యక్షుడు ఎం రమేశ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మర్పల్లి: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సురేష్‌తో కలిసి ఆయా గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.80లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్సల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేదలు ఈ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, మాజీ చైర్మన్ రామేశ్వర్, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, మాజీ సర్పంచ్‌లు పాండు రంగారెడ్డి, పాండునాయక్, అబ్రహం, మాజీ ఎంపీటీసీ మహేశ్, మండల నాయకులు దివాకర్, సర్వేశ్, ఆనందం, శ్రీనివాస్ రెడ్డి, రాములు, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న మహేందర్‌రెడ్డి తదితరులు

16న భవన నిర్మాణ రంగ మహాసభ

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

షాబాద్: ఈ నెల 16న నిర్వహించే భవన నిర్మాణ రంగ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. బంజారాహిల్స్ లోటస్ పాండ్‌లోని రావినారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న భవన నిర్మాణ రంగ మూడవ సభలకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. దేశవ్యాప్తంగా 10 కోట్లకు పైగా కార్మికులకు 60 ఏళ్లు దాటిన తర్వాత పెన్షన్‌తో సహా అన్ని సదుపాయాలు కల్పించాలని.. లేబర్ అడ్డాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కన్వీనర్ శేఖర్, కో కన్వీనర్ అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నారాయణ, నాయకులు రఘు, మధు, రాములు, శ్రీనివాస్ తదితరులున్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామస్వామి తదితరులు

కేజీబీవీలో ఘనంగా వీడ్కోలు

యాలాల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో శనివారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు గిరిజన సాంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు చేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఓ మంగమ్మ మాట్లాడుతూ.. పదోతరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి కేజీబీవీకి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సీఆర్‌టీలు కృష్ణవేణి, గీతారాణి, మమత, మాధవి పాల్గొన్నారు.



వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులతో సిబ్బంది

బీజేపీ జయకేతనం.. నేతల సంబరం



ధారూరు: టపాసులు పేలుస్తున్న బీజేపీ నాయకులు



పరిగిలో బీజేపీ నాయకుల సంబరాలు



మర్పల్లిలో బాణసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట: ఇరవై యేడేళ్ల తర్వాత దేశరాజధాని ఢిల్లీలో బీజేపీ సింహాసనం కైవసం చేసుకుందంటూ మండల బీజేపీ నాయకులు శనివారం మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో తమపార్టీ అత్యధిక సీట్లు గెలుపొందిందన్నారు. దేశంలో నరేంద్రమోదీ నాయకత్వాన ఢిల్లీలో విజయకేతనం ఎగురవేశారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలో టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాకలి నర్సింలు, బాబయ్యనాయుడు, నాగూరావు, ముకుందు, జగదీశ్, జనార్దన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: బీజేపితోనే అభివృద్ధి సాధ్యమని ఢిల్లీ ఫలితాలే దీనికి నిదర్శనమని సినిమా సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్ అన్నారు. బీజేపి అధిక సీట్లు సాధించడం పట్ల పూడూరు మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధిక స్థానాలు సాధిస్తుందన్నారు. పూడూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. మండల అధ్యక్షుడు రాఘవేందర్, వెంకటయ్య, జంగయ్య, శ్రీశైలం, సుభాన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: ధారూరు మండల కేంద్రంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎం. రమేశ్, జగదీశ్వర్, రవీందర్‌గౌడ్, కె.అంజయ్య, ప్రకాశ్, రాజు, క్రిష్ణ పాల్గొన్నారు.

కుల్కచర్ల: కుల్కచర్ల మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర టెలీకాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఘనపురం వెంకటయ్య మాట్లాడుతూ...అవినీతిరహిత పాలన ఒక్క బీజేపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు జానకిరాం, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సామ్యారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, నర్సింహ రెడ్డి, మైపాల్, సురేష్, చంద్రలింగం పాల్గొన్నారు.

పరిగి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పట్టణ కేంద్రంతో పాటు, గ్రామాల్లో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ నాయకులు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని, టపాసులు కాల్చి విజయాన్ని పండుగలా జరుపుకున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు.

మర్పల్లి: ఢిల్లీలో బీజేపీ జెండా ఎగరవేయడం అభినందనీయమని మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బలరాంగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మండల నాయకులు పాల్గొన్నారు.

తాండూరులో..

తాండూరు: బీజేపీపైనే ప్రజలకు విశ్వాసం పెరిగిందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్ అన్నారు. తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్‌లో బాణాసంచా పేల్చి, ఒకరినొకరు స్వీట్లు తినిపించుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.